క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


ప్రణీత

సత్తుపల్లిటౌన్: పట్టణానికి కొమ్ము ప్రణీత అండర్–14 విభాగంలో జాతీయ స్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైంది. బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈ నెల 15నుంచి జరగనున్న పోటీల్లో ఆమె పాల్గొననుండగా, పలువురు అభినందించారు.

వన నర్సరీల పరిశీలన

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ, మల్లారం గ్రామాల్లోని వన నర్సరీలను మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు పరిశీలించారు. నర్సరీల్లో చేపడుతున్న పనులను పరిశీలించి మాట్లాడారు. నర్సరీల్లో బ్యాగు ఫిల్లింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

పెనుబల్లి : ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తుమ్మలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ ద్వారా ప్రజలకు రాయితీలను, విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లను, దివ్యాంగులకు 50 శాతం రాయితీతో కూడిన బస్ పాస్‌లను, డయాలసిస్ రోగులకు ఉచిత బస్‌పాస్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగయ్య, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

మధిర: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీఎస్ ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మంగళవారం మధిర డిపోలో ఆర్టీసీ కార్మికులు బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పద్మావతి, వెంకన్న మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి రెండు శాతం నిధులు కేటాయించాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు రెండు పే స్కేల్స్ వెంటనే చేయాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని, పెంచిన పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోగేశ్వరరావు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

సత్తుపల్లిరూరల్: చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణవరపు శ్రీనివాస్ కోరారు. సత్తుపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యాన బీసీల సంక్షేమానికి ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుతో పాటు శ్రీనివాస్, నాగేశ్వరరావు, రంగారావు, సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతిపై సంతాపం

కల్లూరు రూరల్: మండలంలోని చంద్రుపట్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు వల్లభనేని శ్రీనివాసరావు(50) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఈ మేరకు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఇక ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మృతుడి కుటుంబీకులను ఫోన్‌లో పరామర్శించారు. అలాగే ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్ ప్రసాద్‌తో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు.

శతాధిక వృద్ధుడు మృతి

కారేపల్లి: శతాధిక వృద్ధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లికి చెందిన మారుతి రాములు(102) సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు మంగళవారం ఉసిరికాయలపల్లి గ్రామంలో మారుతి రాములు మృతదేహాన్ని సందర్శించి, మృతదేహంపై ఎర్రజెండాను కప్పి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బన్సీలాల్, సీపీఎం మండల కార్యదర్శి నరేందర్, వెంకటేశ్వర్లు, మల్లయ్య, శంకర్, వెంకన్న, నరసయ్య, సతీష్, బాబు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

చింతకాని: వివాహితపై గొడ్డలితో దాడి చేసిన ఆమె భర్త, అత్తను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గతనెల 26న గ్రామానికి చెందిన వివాహితతో భర్త రమేష్, ఆయన తల్లి మంగమ్మ ఇరువురు గొడవ పెట్టుకోగా రమేష్ తన భార్య తలపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భవనంపై రాళ్ల దాడి

మధిర: పట్టణంలోని వైరా రోడ్డులో వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపాన మోహిత్ టవర్స్‌పై ఒక యువకుడు సోమవారం అర్ధరాత్రి దాటాక రాళ్లతో దాడి చేశాడు. ఈ ఘటనలో భవనం అద్దాలు ధ్వంసం కాగా, భవన యజమాని మధిర టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై స్వప్న పరిశీలించి సీసీ పుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన యువకుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

డాక్టర్లు ఫుల్.. సౌకర్యాలు నిల్

అసౌకర్యాల నడుమ పెనుబల్లి ఆస్పత్రి
- ప్రతి రోజూ 200 మందికి పరీక్షలు
- రెండు గదుల్లో పది మంది డాక్టర్లు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది


ఒకే గదిలో పరీక్షలు చేస్తున్న నలుగురు వైద్యులు



పెనుబల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కనీస సౌకర్యాలు లేక వైద్యులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 50 పడకల ఈ ఆస్పత్రిలో ప్రతి రోజూ 200ల మంది వరకు ఔట్ పేషెంట్ రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. ఈ వైద్య శాలలో ప్రస్తుతం 10 మంది వైద్యులు పనిచేస్తున్నారు. ఒక సర్జన్, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్ వైద్యుడు, మత్తు డాక్టర్, డెంటిస్టులతో పాటు ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులు, ఒక కంటి వైద్య నిపుణుడు పనిచేస్తున్నారు. అయితే ఈ డాక్టర్లు రోగులను పరీక్షించి మందులు రాయడానికి అవసరమైనవి, కనీసం కూర్చోవడానికి స్థలం కూడా లేని పరిస్థితి నెలకొంది. ఈ పది మంది డాక్టర్లు కేవలం రెండు గదుల్లోనే కూర్చొని, ఒక్కొక్క గదిలో 4, 5 డాక్టర్ల వంతున కూర్చొని రోగులను పరీక్షించి మందులు రాసి చికిత్సలు చేస్తున్నారు. ఈ డాక్టర్ల వద్దకు వచ్చే రోగులు కనీసం కుర్చీలో కూర్చొని వారి సమస్యను డాక్టర్లకు వివరించే పరిస్థితి లేదు.

ఇవీ ఇక్కడి సమస్యలు..
- ఒక్క గదిలోనే ఐదుగురు డాక్టర్లు ఒకే సారి నలుగురు, ఐదుగురు రోగులను పరీక్షిస్తుండటంతో ఆ గదుల్లో గందరళగోళం ఉండి సరైన వైద్యం అందించలేని పరిస్థితి నెలకొంది.
- వైద్యులకు, సిబ్బందికి, రోగులకు అవసరమైన న్ని మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ఎముకల డాక్టర్‌కు అవసరమైన టేబుల్, కట్లు కట్టే పరికరాలు అందుబాటులో లేక ప్రాథమిక వైద్యానికే పరిమితం అవుతుంది.
- అలాగే డెంటల్ డాక్టర్‌కు అవసరమైన రోగి కూర్చునే కుర్చీ, పరికరాలు అందుబాటులో లేక పన్ను కూడా పీకే పరిస్థితి లేక మందులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.
- కంటి వైద్య నిపుణుడికి ప్రత్యేకంగా గది లేకపోవడంతో డాక్టర్లు ఉండే ఆ రెండు గదుల్లోనే సర్దుకుని కంటి పరీక్షలు చేయడానికి తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది.
- గర్భిణులకు శస్త్ర చికిత్సలకు అవసరమైన ఆపరేషన్ థియేటర్, స్కానింగ్ మిషన్, రక్త పరీక్ష కేంద్రం, ఎక్స్‌రే ప్లాంట్ తదితర సౌకర్యాలు ఉన్నప్పటికీ మరికొన్ని వసతులు లేక డాక్టర్లు పూర్తి స్థాయిలో చికిత్సలు అందజేయలేకపోతున్నారు.

కావాల్సిన వసతులు..
- ఇదిలా ఉంటే ఈ కమ్యూనిటీ ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న 50 పడకలను 100 పడకలగా సంఖ్యను పెంచి ఇన్‌పేషెంట్ రోగులకు అవసరమైన గదులు, బెడ్లు సమకూర్చాలని స్థానికులు కోరుతున్నారు.
- అలాగే ఆస్పత్రికి అనుభందంగా 108 వాహనం లేకపోవడంతో రోడ్డు ప్రమాదాల బారిన పడ్డ వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ ఆస్పత్రికి అనుబంధంగా ఆయుర్వేదిక్ వైద్యశాల, హోమియో వైద్యశాల కూడా ఉండటంతో ఆయా డాక్టర్లు, సిబ్బంది మందులకు చెరొక గదిలోనే అన్నీ ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల సత్తుపల్లి ప్రాంతానికి వచ్చిన వైద్య ఆరోగ్య శాఖామంత్రి హరీష్‌రావు పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాల నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు హామీ ఇచ్చారు. ఈ మేరకు త్వరితగతిన సకల సౌకర్యాలతో కొత్త ఆస్పత్రి భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేసి ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కుర్చీలు కూడా లేవు..


ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులు డాక్టర్ల వద్ద కూర్చొని తమ ఆరోగ్య సమస్యను వివరించడానికి కనీసం కుర్చీలు కూడా లేవు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో డాక్టర్‌కు ఒక్కొక్క గది కేటాయించి, రోగులు కూర్చునేందుకు కూడా కుర్చీలు ఏర్పాటు చేస్తే మెరుగైన వైద్య సేవలు అందుతాయి.
– ఎస్‌కే పాషా, పెనుబల్లి బీసీ కాలనీ వాసి

కొత్త భవనం నిర్మించాలి..


45 ఏళ్ల క్రితం నిర్మించిన ఆస్పత్రి భవనం ప్రస్తుత రోగులకు సరిపోవడం లేదు. రోగుల సంఖ్య పెరుగుతున్నా అవసరాలకు అనుగుణంగా పాత భవనానికి అదనంగా కొత్త భవనాన్ని నిర్మించి అన్ని రకాల వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి.
– వంగా సత్యనారాయణ, పెనుబల్లి బీసీ కాలనీ వాసి

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర కావడి ఉత్సవం

ఏన్కూరు: మండలంలోని బురదరాఘవాపురంలో సుబ్రహ్మణ్యేశ్వర మహాకావడి ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6.30గంటలకు దేవాలయంలో సుబ్రహ్మణ్యస్వామి మూల విరాట్‌కు వేదపండితులచే పంచామృతాభిషేకము, 7 గంటలకు దేవాలయం నుంచి మహాకావడి సేవ, ఉత్సవ మూర్తుల పల్లకీసేవ, కోలాటబృందాల విన్యాసాలతో మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు, మధ్యాహ్నం 1గంటకు కావడిదారుల ఉత్సవమూర్తుల ఆలయప్రవేశం, సాయంత్రం 5గంటలకు సుబ్రహ్మణ్యస్వామి సామూహిక కల్యాణం నిర్వహించి భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహాకావడి సేవలో అన్ని గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు కావడి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అంతర్గత మార్కులు పరిశీలన

కొణిజర్ల: మండలంలోని గెజిటెడ్ హెచ్ఎం పుల్లయ్య నేతృత్వంలో ఉపాధ్యాయుల బృందం పల్లిపాడు కార్తీక్ విద్యాలయం, శాంతినగర్ మేరీ ఇమ్మాక్యులేట్, పెద్దమునగాల, పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో రికార్డులు, నోట్ పుస్తకాలు పరిశీలించి మార్కులు వేసిన విధానాలపై పలు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో సబ్జెక్ట్ నిపుణులు పి.మురళి, భాస్కర్, రమణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి, సిస్టర్ రాజపుష్పం ఆర్.శ్రీనివాసరావు, బి.కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి


బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మధిర: విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారి డాక్టర్ ప్రభుదయాళ్ అన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మధిర బంజారా కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. నాలుగో తరగతి విద్యార్థిని మనస్వి తప్పులు లేకుండా ఆంగ్ల పాఠాన్ని అనర్గళంగా చదవడంతో ఆమెకు డిక్షనరీ, నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీరాజ్యం ఉపాధ్యాయుడు రాజు పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రాన్ని అందిస్తున్న ఎంపీ కృష్ణయ్య

సత్తుపల్లిరూరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్తుపల్లికి చెందిన డాక్టర్ రాజబోయిన ప్రసాదరావును నియమిస్తూ.. ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని హైదరాబాద్‌లో అందించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. తనకు సహకరించిన జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు, జిల్లా అధ్యక్షుడు పిడిప్రోలు రామ్మూర్తి, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రామన్నపాలెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఎర్రుపాలెం: మండలంలోని రామన్నపాలెంలో మంగళవారం ఎట్టకేలకు అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గతకొంత కాలంగా గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో పలుమార్లు మామునూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాసరావుకు స్థానిక సర్పంచ్ కొత్తపల్లి విద్యాసాగర్ సమస్య తీవ్రతను వివరిస్తూ వినతిపత్రాలు అందచేశారు. దీంతో ఏఈ ఆర్.శ్రీనివాసరావు స్పందించి 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామంలో ఏర్పాటు చేశారు. సమస్యను పరిష్కరించిన విద్యుత్ అధికారులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లైన్‌మెన్ వంశీ, కొత్తపల్లి ప్రశాంత్ తదితరులున్నారు.

జీవన ఎరువుల వినియోగాన్ని పెంచాలి

ముదిగొండ: రైతులు భూమిలో భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువుల వినియోగాన్ని పెంచాలని మండల వ్యవసాధికారిణి మందుల రాధ పేర్కొన్నారు. మండలంలోని వల్లబి, బాణాపురం, వనంవారికిష్టాపురంలోని రైతు వేదికల్లో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పంట దిగుబడి సాధించాలంటే రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ లు, రైతులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

కల్లూరు: హమాలీ కార్మికుల చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలమైయ్యాయని ఖమ్మం జిల్లా హమాలీ సంఘం నాయకుడు ఖమ్మంపాటి పుల్లారావు అన్నారు. కల్లూరులో మంగళవారం ప్రగతిశీల అండ్ మిల్‌వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లో లేబర్ కమిషనర్ కార్యాలయం మందు జరిగే ధర్నాకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు ఏడుకొండలు, వెంకట్రావ్, నాగరాజు, జనార్దన్, మోహన్‌రావు, ఉపేంద్ర, నరసింహారావు, గోపి పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

మధిర: రాష్ట్ర బడ్జెట్‌లో తక్కువ నిధులను కేటాయించి విద్యారంగాన్ని ప్రభుత్వం విస్మరించిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం బడ్జెట్‌లో గత ఏడాది 7.30శాతం నిధులు కేటాయించి, ఈ ఏడాది 6.57 శాతం మాత్రమే కేటాయించడం అన్యాయమని పేర్కొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

చింతకాని: రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ పూర్ణయ్య అన్నారు. మంగళవారం జగన్నాథపురం రైతువేదికలో రైతుబంధు సమితి క్యాలెండర్లను ఎంపీపీ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జగన్నాథపురం, మత్కేపల్లి గ్రామసర్పంచ్‌లు ఆలస్యం నాగయ్య, తిరుపతి కొండలరావు, రైతుబంధు సమితి కన్వీనర్ షేక్ షిలార్ సాహెబ్, వ్యవసాయ విస్తరణాధికారి తాహియా నౌషీన్, రైతులు పాల్గొన్నారు.

పే స్కేల్ ప్రకటించడం హర్షణీయం

చింతకాని: సెర్ప్ ఉద్యోగులకు ఏప్రిల్ నెల నుంచి పే స్కేల్ వర్తింపజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ గ్రామీణాభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండపరెడ్డి నరేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 23 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడిన సెర్ప్ ఉద్యోగుల గుర్తించటం ఆనందంగా ఉందన్నారు.

వృథాగా పోతున్న భగీరథ నీరు

కల్లూరు రూరల్: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది. కానీ తాగు నీటి వృథాను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కల్లూరు మండలంలోని పుల్లయ్య బంజరులో మిషన్ భగీరథ పైపులైను పగిలి గత వారం నుంచి తాగునీరు వృథాగా పోతున్నాయి. దీంతో పుల్లయ్య బంజరు కాలనీ, తూర్పు లోకవరం గ్రామాల ప్రజలకు తాగునీరు అందటంలేదు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయమై ఏఈని వివరణ కోరగా పైపులైన్ పగలిపోయి నీరు సరఫరా వృథా విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. సిబ్బంది సమ్మెలో ఉండటతో జాప్యం జరిగిందని త్వరలో మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.


పుల్లయ్య బంజరులో పైపులైన్ పగిలి వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

అన్నిరంగాల్లో మధిర అభివృద్ధి

మధిర: ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేసిన రూ.30 కోట్ల నిధులతో మధిర మున్సిపాలిటీ అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లతా జయాకర్ తెలిపారు. 'గుడ్ మార్నింగ్ మధిర'లో భాగంగా మంగళవారం 9, 10 వార్డుల్లో కౌన్సిలర్లు మల్లాది సవిత, వాసుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకున్నాక మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో అభివృద్ధి పనులు కొనసాగిస్తామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి, కమిషనర్ అంబటి రమాదేవితో పాటు కనుమూరు వెంకటేశ్వరరావు, జే.వీ.రెడ్డి, కరివేద సుధాకర్, ధరావత్ మాధవి, వై.వీ.అప్పారావు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, తదితరులు

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి


చింతకాని: 'కంటివెలుగు'ను ప్రారంభిస్తున్న ఎంపీపీ పూర్ణయ్య

చింతకాని/తల్లాడ: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటివెవెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, అంబేడ్కర్ నగర్, కొత్త వెంకటగిరి గ్రామ సర్పంచ్‌లు జొన్నలగడ్డ కిరణ్, సంతోషం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా కంటి సమస్యలు తొలిగిపోతాయన్నారు. అనంతరం పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్ల అద్దాలను అందించారు. ఆయా కార్యక్రమాలల్లో గ్రామసర్పంచ్ షేక్ గౌషాబీ, లింగం రేణుక, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, డాక్టర్ సుచరిత, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, ఏఎన్ఎం రుతుకుమారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివశంకర్, వైద్య సిబ్బంది భాస్కర్, పెద్ద పుల్లయ్య, రాజేశ్వరీ, సతీష్, శ్రీనివాస్, తేజశ్వనీ, మాధవి, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

వేంసూరు: తెలంగాణ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదని మాజీ మంత్రి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్ మండిపడ్డారు. మంగళవారం మండలంలో హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కందుకూరు, భరణిపాడు, వెంకటాపురం గ్రామాల్లో పర్యటించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు, చేయబోయే అభివృద్ధిని గురించి వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, ఎస్సీ రాష్ట్ర డిపార్ట్‌మెంట్ కన్వీనర్ కొండూరి కిరణ్‌కుమార్, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రాఘవరెడ్డి, నియోజకవర్గ యూత్ కార్యదర్శి మధు, వేణు, పుల్లారావు, అశోక్, సత్యనారాయణ, సురేష్, వెంకటకృష్ణ, వెంకటేశ్వరరావు, బాబూరావు, లాజర్ తదితరులు పాల్గొన్నారు.


వేంసూరు ప్రచారంలో పాల్గొన్న సంభాని

బీఆర్ఎస్‌కు పలువురి రాజీనామా


రాజీనామా ప్రకటించిన నాయకులు

వైరారూరల్: పొంగులేటి వెంటే మా ప్రయాణం అంటూ మండలంలోని గరికపాడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆ పార్టీ సభ్యత్వానికి, తమ పదవులకు మంగళవారం రాజీనామ చేశారు. మాజీ సొసైటీ చైర్మన్ శీలం సురేందర్‌రెడ్డి, గరికపాడు గ్రామశాఖ అధ్యక్షుడు రేమల్లి గాంధీ, ఆత్మకమిటీ డైరెక్టర్ లక్కిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, నీటి సంఘం మాజీ డైరెక్టర్ శీలం శ్రీనివాసరెడ్డి, రైతు సమన్వయ సమితి సభ్యుడు గుడిపూడి రామకృష్ణ, గ్రామశాఖ ఉపాధ్యక్షుడు జోనబోయిన వలరాజు, గ్రామ యూత్ కమిటీ అధ్యక్షుడు శీలం వేణుగోపాల్‌రెడ్డితో పాటు రేమల్లె రవికుమార్, రేమల్లె చంద్రశేఖర్, వేమిరెడ్డి శివరామకృష్ణరెడ్డి, సంగీతపు అనీల్, సంగీతపు నరసింహారావు, గ్రామశాఖ మహిళ అధ్యక్షురాలు శీలం విజయలక్ష్మి, గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి, వెంకటస్వామి, విజయరావ్, కొండ, శ్రీనివాసరావు, రమేష్, సైదులు, సత్యంలు మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో పొంగులేటి అడుగుజాడల్లో నడుస్తూ.. పొంగులేటి ప్రధాన అనుచరుడైన మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ సారథ్యంలో పొంగులేటి నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

కారేపల్లి: ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులను ప్రోత్సహిస్తే.. వారు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం అన్నారు. మంగళవారం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రముఖ వైద్యులు, పర్సా పట్టాభిరామారావు, విజయలక్ష్మి దంపతులు రూ.15వేలు విలువ చేసే ఎంసెట్ మెటీరియల్‌ను అందజేశారు. వీరితో పాటుగా, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు రూ.4వేలు, కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టైపిస్టుగా పని చేస్తున్న పద్మావతి రూ.5వేలు విలువ చేసే ఎంసెట్ మెటీరియల్ కొనుగోలు చేసి విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మోహన్, అధ్యాపకులు జయప్రకాశ్, ప్రసాద్, మల్లికా, పార్థసారథి, వనిత, లక్ష్మీనారాయణ, రాంబాబు, విజేందర్, యాకయ్య, బాబురావు, కవిత, కృష్ణవేణి, రజిని, పాషా, సుధీర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.50 వేలు విరాళం

సత్తుపల్లి: పట్టణంలోని పాతసెంటర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి రూ.50వేలు మంగళవారం విరాళాన్ని అందించారు. ఇటీవల ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహావిష్కరణకు వచ్చినప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు చెక్కును పంపించారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే రఫీ చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం చిత్తలూరి ప్రసాద్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంకమరాజు, శ్రీను, కృష్ణారావు, రవీందర్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ మదీనా పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన నిరుపేద వృద్ధులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కోదాడకు చెందిన క్రిస్టియన్ మిషనరీ రామారావు ఆర్థిక సాయంతో ఎన్టీఆర్‌నగర్, గాంధీనగర్, జవహర్‌నగర్‌లలోని వృద్ధులకు వీటిని అందించడం జరిగింది. కార్యక్రమంలో ఎన్‌సీసీ ప్యాట్రాన్ కొర్రపాటి వసంతకుమార్, జిల్లా లీగల్‌వింగ్ అధ్యక్షుడు తేళ్లూరి ఆడమ్స్, కరుణతేజ, కె.దేవసహాయం, జయరాజు, జార్జీ, నవకుమార్, వెంకటేశ్వరరావు, కుమార్‌రాజ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కారేపల్లి: కారేపల్లి గ్రామానికి చెందిన పెద్దమ్మ పులయ్య ఇటీవల అనారోగ్యానికి గురైయ్యాడు. అతడు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న అతను ఒక్కసారిగా అస్వస్థతకు గురై కాళ్లు చేతులు పడిపోయడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ క్రమంలో చాలా అప్పులు చేశారు. దీంతో పుల్లయ్య కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న కారేపల్లికి చెందిన ఎస్సీసెల్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మేదరి టోనీవీరప్రతాప్ తన వంతు సాయంగా రూ.5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తాజుద్దీన్, రామారావు, రామారావు, ఆజామ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ ఎత్తివేసే ఆలోచనను విరమించుకోవాలి

కొణిజర్ల: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ని ఎత్తి వేయాలనే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం రైతు సంఘం నాయకులు మండలంలోని పలు గ్రామాలలో రైతుల ఇండ్లలో ఉన్న పత్తి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి ధర పెరగాల్సింది పోయి రోజు రోజుకీ తగ్గిపోతుందన్నారు. రూ.9 వేలకు పైగా ఉన్న పత్తి ధర ప్రస్తుతం రూ.7 వేలకు పడి పోయిందన్నారు. రైతులకు కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రం తక్షణేమ సీసీఐ ఎత్తివేసే ఆలోచనను విరమించుకుని సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చలపతిరావు, కుటుంబరావు, నరసయ్య, పురుషోత్తం, పాషా, సతీష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


నిల్వ పత్తిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు